క్లుప్తంగా

సత్యదేవ నర్సరీ సందర్శన



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న అంజనా సిన్హా

కడియం: కడియపులంకలోని పుల్లా ఆంజనేయులుకు చెందిన శ్రీ సత్యదేవ నర్సరీని ఏపీ రోడ్‌సేఫ్టీ అథారిటీ చైర్మన్ అంజనా సిన్హా మంగళవారం సందర్శించారు. వారికి నర్సరీ రైతులు పుల్లా వీరబాబు వివిధ రకాల మొక్కలను గురించి వివరించారు. నర్సరీలో అభివృద్ధి చేస్తున్న పలు రకాల సరికొత్త రకాలను చూసి రైతులను అభినందించారు. స్థానికంగా ఉన్న రోడ్ల సమస్యలను గురించి ఈ సందర్భంగా పలువురు నర్సరీ రైతులు అంజనా సిన్హా దృష్టికి తీసుకువచ్చారు.

512 మందికి వైద్య పరీక్షలు



జేగురుపాడులో పరీక్షలు చేస్తున్న వైద్యులు

కడియం: జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడతలో భాగంగా జేగురుపాడు సచివాలయం – 1 పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 512 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎస్.నాగసాయిమౌర్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 98 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, ఇద్దరిని ఆరోగ్యశ్రీకి ఆస్పత్రులకు రిఫర్ చేశారు. డాక్టర్లు మణి జ్యోత్స్న, రాతు పార్థసారథి, ఆర్.శ్రావణి, గౌతమ్ తమ సిబ్బందితో సేవలందించారు. శిబిరాన్ని సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శి బి.శిరీష పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



కాతేరులో సేవలందిస్తున్న వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు సచివాలయం – 4 పరిధిలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 శిబిరంలో 441 మందికి వైద్య సేవలు అందించారు. ఇద్దరిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రిలకు రిఫరల్ చేశారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్, కాతేరు పీహెచ్‌సీ వైద్యులు ఈ.నాగదేవి, జగదీష్ కృష్ణ, జనరల్ సర్జన్ మౌనిక, గైనకాలజిస్ట్ పి.భారతి, కంటి పరీక్షల ఆప్తాల్మిజిస్టులు వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి ఈసీజీ, రక్తపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ నార్త్ ఇన్‌స్పెక్టర్‌గా నిక్సన్



రాజమహేంద్రవరం రూరల్: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా డాక్టర్ ఎస్.నిక్సన్ బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ ఎస్ఈబీ తూర్పు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో సారా, అక్రమ మద్యం విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గంజాయి, ఇతర మత్తుపదార్థాలవైపు వెళ్లకుండా విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

తల్లీ కుమారుడి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: తన కుమార్తె, మనవడు కనిపించడం లేదని లాలాచెరువు పోలీస్ క్వార్టర్స్ వెనుక ప్రాంతానికి చెందిన రెడ్డి సత్యవతి మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. రెడ్డి పార్వతి 23 ఏళ్ల కుమార్తె తానారి భవాని, భర్తతో కలిసి అమ్మగారి ఇంట్లోనే ఉంటోంది. ఆమెకు ఏడాదిన్నర బాబు వరుణ్ ఉన్నాడు. అయితే భవాని సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తుండడంతో తల్లి సత్యవతి మందలించింది. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ఈనెల 21 తేదీ తెల్లవారుజామున 3 గంటల సమయంలో సత్యవతి నిద్రలేచేసరికీ భవాని, వరుణ్ కనిపించలేదు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై జగన్‌మోహనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు కాకినాడకు షర్మిల రాక

రాజమహేంద్రవరం సిటీ: పీసీసీ చీఫ్ షర్మిల గురువారం కాకినాడ రానున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు అరిగెల అరుణ కుమారి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ కార్యాచరణ గురించి సమావేశం జరుగుతుందన్నారు. పార్టీ వివిధ విభాగాల కమిటీల అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తరలిరావాలని కోరారు.

స్వచ్ఛత మన సమష్టి బాధ్యత

- సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే గుడ్ మార్నింగ్
- 16వ డివిజన్‌లో మంత్రి వేణు పర్యటన



డ్రైనేజీ సమస్య పరిష్కారంపై కమిషనర్‌కు సూచనలు చేస్తున్న మంత్రి వేణు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛత మన సమష్టి బాధ్యత అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, బీసీ సంక్షేమం, రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్వచ్ఛత మన బాధ్యత.. గుడ్ మార్నింగ్ రాజమహేంద్రవరం రూరల్ కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం రూరల్ నియోజకవర్గ పరిధి 16వ డివిజన్‌లోని ఆదర్శ నగర్, బాలాజీ పేటల్లో పర్యటించారు. పలు సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రూరల్ ప్రాంతంలోని ప్రతి వార్డును పరిశీలించి స్వచ్ఛతే లక్ష్యంగా పరిశుభ్రతకు చర్యలు తీసుకోవడంతో పాటు తాత్కాలిక అవసరాలు తీర్చడం గుడ్ మార్నింగ్ ప్రధాన ఉద్దేశమన్నారు. బడుగు, బలహీన వర్గ ప్రజలకు ఆర్థికంగా బలపడేందుకు సీఎం జగన్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రజల ద్వారా ఎన్నుకోబడిన వ్యక్తులు ప్రజల మధ్యనే ఉండడం ద్వారా సమస్యలు తెలుస్తాయని వాటిని వేగవంతంగా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

మంత్రి వేణు మాట్లాడుతూ రూరల్ నియోజకవర్గంలో ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం కల్పించాలన్నారు. ప్రజలు ఏ సమస్య వచ్చినా తనకు తెలియజేయాలని కోరారు. ఆదర్శ నగరలోని ఒక పార్కులో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను దినేష్ కుమార్‌ను ఆదేశించారు. బాలాజీ పేటలోని పలు డ్రైనేజీలను పరిశీలించి మురుగునీరు పారేలా శుభ్రం చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం గడప గడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, గొందేశి పూర్ణచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు గొందేశి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, రూరల్ డివిజన్ల క్లస్టర్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, డివిజన్ల జేసీఎస్ ఇన్‌చార్జి కొప్పిసెట్టి ప్రసాద్ బాబు (రాజమౌళి), 40వ సచివాలయ కన్వీనర్లు గోపి, యలవర్తి నాగేంద్ర, ప్రకాష్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, గొందేశి శ్రీనివాసులరెడ్డి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు, పార్టీ నాయకులు చీకురుమిల్లి చిన్న, రొంపిచర్ల రమేష్, అంగాడి సత్యప్రియ, షేక్ ఇమామ్, పడమటి కామరాజు, నాగమణి, సబ్బెళ్ల విజయ దుర్గారెడ్డి, కల్లి అప్పలరెడ్డి, జువ్వల నాగిరెడ్డి, దోనిపాటి రాజేష్, గిరి, చాప రాజా, రాంకీ, మాజీ ఎంపీపీ రేలంగి వీర వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలన శ్రీరామరాజ్యం

కడియం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన శ్రీరామరాజ్యం అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రూరల్ కోఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కడియం మండల ముఖ్య నాయకులతో వీరవరం రోడ్డులోని జీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి వేణు మాట్లాడుతూ పేదవాడి గుమ్మం ముందుకే ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను అందిస్తూ చక్కటి పాలనను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. జగన్ పాలన కొనసాగించుకోవడం పేదలకు అత్యవసరమన్నారు. పెత్తందారీ విధానాలు, భావజాలంతో వ్యవహరించే పార్టీలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చంద్రబాబు నాయుడి రాక్షస పాలనకు, ఇప్పటి జగన్ పాలనకు వ్యత్యాసాన్ని ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇంటికే పింఛన్‌ను జగన్ అందిస్తున్నారన్నారు. అక్కచెల్లెమ్మలకు నాలుగు విడతలుగా రుణమాఫీ చేసి తన ఉదారతను చాటుకున్నారన్నారు. పేదలు, వెనుకబడిన వర్గాల ప్రజలకు జగన్ అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం వెనుకా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారన్నారు. మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, రాష్ట్ర దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి బడుగు చిన్ని, జిల్లా వీవర్స్ సొసైటీ చైర్మన్ యర్రా సూర్యనారాయణ, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల విష్ణుచక్రవర్తి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, సొసైటీ చైర్మన్లు తిరుమలశెట్టి శ్రీను, ఈదర దీనదయాళ్, వెలుగుబంటి అచ్యుతరామ్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు, చిత్రంలో పార్టీ నాయకులు

ఆర్టీసీ ఉద్యోగులకు అభినందనలు



ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న డీఎం షబ్నం

ప్రకాశం నగర్: ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో పరిధిలోని ఆదర్శ ఉద్యోగులకు మంగళవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి మాసం ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేసి వారికి ప్రోత్సాహక నగదు బహుమతులు అందిస్తున్న విషయం తెలిసిందే. స్థానిక డిపో మెయిన్ గేట్ వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి డిపో మేనేజర్ ఎస్‌కే షబ్నం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత ఏడాది డిసెంబర్‌లో అత్యధిక అదాయం, అత్యధిక డీజిల్ పొదుపు చేసిన సిబ్బందిని ఎంపిక చేసి వారికి నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

కడియం: వేమగిరి గ్రామానికి చెందిన సర్వే నంబర్ 127/2లోని రాజమహేంద్రవరానికి చెందిన నందం వీర వెంకట సుబ్రహ్మణ్యం భూమిలో యజమానికి తెలియకుండా గ్రావెల్‌ను అక్రమంగా తవ్వేశారని గ్రామ రెవెన్యూ సిబ్బంది కడియం పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. ఈ సర్వే నంబర్‌లో 14.44 ఎకరాల భూమి ఉండగా అందులో 4 ఎకరాల్లో గ్రావెల్‌ను అక్రమంగా తవ్వేశారన్నారు. ఈ మేరకు కడియం ఎస్ఐ బాలాజీ సుందరం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న పొక్లెయిన్లు, లారీలను నిలుపుదల చేశారు.

ఉచిత ప్రయాణంతో మా పొట్టలు కొట్టొద్దు



మెయిన్ రోడ్డులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ: ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేయవద్దని, అలాగే ఏ పార్టీ కూడా హామీ ఇవ్వొద్దని ఆటో వర్కర్స్ యూనియన్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. జేఏసీ పిలుపు మేరకు మంగళవారం నగరంలో ఆటోల బంద్ నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణం వద్దు.. ఆటోవాలాల పొట్ట కొట్టొద్దు అని నినాదాలు చేస్తూ కోటిపల్లి బస్టాండ్ నుంచి కోటగుమ్మం వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. జేఏసీ నాయకులు వాసంశెట్టి గంగాధరరావు, బొలిశెట్టి సత్యనారాయణ ప్రసాద్ (బాక్స్ ప్రసాద్), నల్లం శ్రీను, బట్లంకి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ పథకం వల్ల ఆటోవర్కర్లు ఉపాధి కోల్పోయి దుర్భర జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అర్హులందరికీ ఓటుహక్కు ఉండాలి



ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్ సుజాత తదితరులు

కడియం: అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తహసీల్దార్ ఎం.సుజాత అన్నారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా స్థానిక హైస్కూల్లో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు తహసీల్దార్ 25వ తేదీ ఓటరు దినోత్సవం సందర్భంగా వివిధ పోటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఓటు గొప్పదనాన్ని వివరించి, రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు వి.లజపతిరాయ్, నాగేశ్వరరావు, హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు సువర్ణవేణి, ఫ్లోరెన్స్ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయలో చిత్రలేఖనం పోటీలు



విజేతలతో ప్రిన్సిపాల్ వర్షా జైన్, న్యాయనిర్ణేతలు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో మంగళవారం ×పరీక్ష పే చర్చ׳ అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా పరాక్రమ్ దివస్ జరిపారు. అనంతరం చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. జిల్లాలోని స్టేట్‌బోర్డు, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటారు. ప్రథమస్థానంలో అంజనా ఐశ్వర్య(సెయింటాన్స్ స్కూల్, బొమ్మూరు), ద్వితీయస్థానంలో జి.అభినందన (ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ రాజమహేంద్రవరం), తృతీయ స్థానంలో వి.పావని తేజశ్రీ (మున్సిపల్ లాలాచెరువు హైస్కూల్), నాలుగో స్థానంలో ఎస్.విద్యారెడ్డి(కేంద్రీయవిద్యాలయ, ఓఎన్‌జీసీ రాజమహేంద్రవరం), ఐదో స్థానంలో కె.వెంకట భీష్మ(భారతీయ విద్యాభవన్, నామవరం) నిలిచారు. వారికి కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ వర్షాజైన్ సర్టిఫికెట్లు అందజేశారు. ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ ఎస్ఎస్ శర్మ, విశ్రాంత ఆర్ట్స్ మాస్టర్ డాక్టర్ యు.ఆశీర్వాదం, రాష్ట్రస్థాయి ఏ గ్రేడ్ ఆర్టిస్ట్ పీఎస్.ఆచారి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

సీఎం జగన్ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి



మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న విష్ణుమూర్తి, పార్టీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని మండల జేసీఎస్ ఇన్‌చార్జి తాటికొండ విష్ణుమూర్తి అన్నారు. మంగళవారం సాయంత్రం శాటిలైట్‌సిటీ గ్రామ సచివాలయం -4లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్లతో కలిసి నిర్వహించారు. అనంతరం సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాల డిజిటల్ బోర్డును, పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి, మా నమ్మకం నువ్వే జగనన్న బుక్‌లెట్‌ను పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా తాటికొండ విష్ణు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగేందుకు, రాష్ట్రాభివృద్ధికి సుదీర్ఘకాలం జగనన్నే ముఖ్యమంత్రిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు ఎంపీపీ సత్యనారాయణ, పగడాల లక్ష్మణరావు, కామిశెట్టి సుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ రుంకాని రమణమ్మ, మాజీ ఉపసర్పంచ్ బొమ్ము శ్రీను, కడవకొల్లు వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు గొర్రెల రమణ, బత్తిన అప్పారావు, రుంకాని రవి కుమార్, సఫారి నాయుడు, దండంటి ప్రభు, పొట్నూరి ప్రతాప్, పిట్ల శివ, ఈదరాడ సూర్యచంద్ర, ప్రకాష్,నె సాయి, పొన్నగంటి లక్ష్మి, దొడ్డి సుధాకర్, కుడిపూడి సత్యనారాయణ, జుత్తుగ శ్రీను, మనోహర్ పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముద్దాల అను, ముత్యాల పోసికుమార్

ధవళేశ్వరం: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ధవళేశ్వరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం సమీపంలోని ఆయన విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీ కాపు కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ ముద్దాల అను, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసి కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు గోలి దేవకుమార్, శ్రీరంగం బాలరాజు, రేగుళ్ల రాజు, మిరప రమేష్, సాదే సురేష్, మిరప మహేష్, బాషా, బుర్ర రాజు, శివ పాల్గొన్నారు.

శోభాయాత్రపై నీచ రాజకీయాలు తగవు



విలేకరులతో మాట్లాడుతున్న అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: శోభాయాత్రపై కూడా నీచ రాజకీయాలు చేసే విష సంస్కృతిని టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి వాసు మానుకోవాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి ధ్వజమెత్తారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమా మార్కండేయేశ్వర స్వామివారి రథాన్ని శ్రీరామచంద్ర ప్రభువు కోసం వినియోగించడం పెద్ద నేరంగా వాసు చిత్రీకరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎండోమెంట్స్ అధికారులను సైతం బెదిరించడం ఆయన మూర్ఖత్వాన్ని స్పష్టం చేస్తోందన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి, నగరంలో ఎంపీ భరత్ రామ్ చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక లేనిపోని ఆరోపణలకు దిగడం వాసు అజ్ఞానమన్నారు. ఇకనైనా ఇటువంటి నీచ రాజకీయాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తా విజయ రాజ్యలక్ష్మి, పాలిక శ్రీను, రామసాయి దీపు, మజ్జి అప్పారావు, మార్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మృత్యుకుహరాలుగా క్వారీ గోతులు



సమావేశంలో మాట్లాడుతున్న కొండబాబు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): క్వారీ ఏరియాలోని సుబ్బారావు నగర్, సింహాచల నగర్ మధ్యలో ఉన్న క్వారీ గోతుల్లో నీరు చేరి మృత్యుకుహరాలుగా మారాయని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ బర్రె కొండబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదకరంగా మారిన ఈ గోతుల్లో పడి పలువురు ప్రాణాలు కోల్పోయారన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అంశంపై తాను 2012లో హైకోర్టులో కేసు వేశానని, గోతులు పూడ్చాలని కోర్టు అనేక ఆదేశాలు జారీ చేసిందని, అయినా అధికారుల నిర్లక్ష్యం, క్వారీ యజమానులు పట్టనట్లు వ్యవహరించడం వల్ల అనేక ప్రాణాలు గంగలో కలిసిపోతున్నాయని మండిపడ్డారు. కోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకోకుండా అధికార యంత్రాంగం సమస్యను గాలికొదిలేసిందని ధ్వజమెత్తారు. వంద అడుగులకు పైగా గోతుల్లో నీరు నిలిచి ఉండడంవల్ల పక్కనే ఉన్న సింహాచలనగర్ పరిస్థితి లూజ్ సాయిల్‌తో ప్రమాదకరంగా మారిందన్నారు. లూజ్ సాయిల్‌తో ఇప్పటికే కొన్ని నివాసాల్లో బాత్‌రూమ్‌లు కుంగుతున్నాయన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మైన్స్, రెవెన్యూ, నగర పాలక సంస్థ, పోలీసు అధికారులతో జాయింట్ యాక్షన్ కమిటీ వేయాలని బర్రె కొండబాబు డిమాండ్ చేశారు.

గైట్ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

రాజానగరం: మహారాష్ట్రలోని నాసిక్‌లో కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి 17 వరకూ జరిగిన 27వ జాతీయ యువజనోత్సవాలలో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు షెకీనా గిడెయోనోక్, డి.వరప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్సు అడ్వెంచర్ రాక్ క్లైంబింగ్‌లో ప్రతిభ కనబరిచిరని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ధనరాజ్ తెలిపారు. అక్కడకు వచ్చిన యువతకు మన ఆత్రేయపురం పూతరేకుల రుచి చూపించడంతో పాటు వివిధ రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకున్నారన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



కణుపూరు హైస్కూల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరు హైస్కూల్లో విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. జగనన్న డిజిటల్ విద్య కార్యక్రమంలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు వీటిని అందించారు. హెచ్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ మంచాల అరుణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీ సిబ్బంది



రాజానగరంలో జాయినింగ్ రిపోర్టులు రాస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రాజానగరం: తమ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తీసుకున్న శ్రద్ధకు అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు నెల రోజులుగా ఆందోళన బాట పట్టిన వీరితో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం కావడంతో మంగళవారం నుంచి విధులలో చేరారు. ఈ మేరకు ప్రాజెక్టు సీడీపీఓకు తమ జాయినింగ్ రిపోర్టులు ఇచ్చేందుకు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయానికి రాజానగరం, కడియం, రాజమహేంద్రవరం రూరల్ మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది భారీగా తరలివచ్చారు. అంగన్‌వాడీల యూనియన్ అధ్యక్షులు ఎం.మార్తమ్మ, సెక్టార్ కార్యదర్శులు విజయ, యు.విశాలి, ఎం.మాధురి, చంద్రవతి మాట్లాడుతూ ఆందోళనలను విరమించి, అంగన్‌వాడీ కేంద్రాలలో అంతా విధులలో చేరామన్నారు. తమ సమస్యలను అర్థం చేసుకుని, సహృదయంతో చొరవ తీసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, మంత్రి బొత్స సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు ఖాయం

- జగన్ పాలనకు ప్రజలందరి మద్దతు
- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రతిపక్ష పార్టీలు ఎన్ని పొత్తులు పెట్టుకున్నా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని, ప్రజలు మద్దతు పార్టీకి పుష్కలంగా ఉందన్నారు. సీతానగరంలోనీ జీవీకే కన్వెన్షన్ హాలులో పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి గ్రామాలకు చెందిన నాయకులతో మంగళవారం ఆయన సమావేశమై పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. పెత్తందారులకు పేదవారికీ జరుగుతున్న ఈ ఎన్నికల సమరంలో చంద్రబాబు నాయుడు పెత్తందారుల వైపు ఉంటే.. జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షాన ఉన్నారన్నారు. పేదలందరికీ ఆర్థిక భరోసా కల్పిస్తూ అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం మనదన్నారు. గత ఎన్నికలలో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని జగనన్న అమలు చేసి నిరూపించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు డాక్టర్ బాబు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, పార్టీ నాయకులు చల్లమళ్ల సుజీరాజు, గద్దె వెంకటకృష్ణ చౌదరి, అంబటి రాజు, ముద్దాల కొండలరావు, గద్దె వీరన్నబాబు, సత్యం రాంపండు పాల్గొన్నారు.

సారా బట్టీ ధ్వంసం

సీతానగరం: చీపురపల్లి పంచాయతీ పరిధి అచ్చయ్యపాలెం శివారు కొండ ప్రాంతంలోని సారా బట్టీపై దాడి చేసి, సంసాని నానీని అరెస్ట్ చేశామని ఎస్సై టి.రామకృష్ణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని, 65 లీటర్ల సారా, మోటారు సైకిల్, రెండు అల్యూమినియం గిన్నెలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు.